## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

### ముఖ్యాంశాలు

- కీలక రంగాలలో భారత్-ఇండోనేషియా దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని విదేశాంగ మంత్రి డాక్టర్ జై.శంకర్ ఉద్ఘాటించారు.
- మురికివాడల నివాసితులకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.
- దేశంలో తక్కువ ధరకే వంటగ్యాస్ సరఫరా చేస్తున్నామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.
- ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = =

కీలక రంగాలలో భారత్-ఇండోనేషియా దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని విదేశాంగ మంత్రి డాక్టర్ జై శంకర్ పేర్కొన్నారు. భారత్-ఇండోనేషియా సంయుక్త కమిషన్ సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు జరిగింది. ఈ సమావేశానికి భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్, ఇండోనేషియా తరఫున విదేశాంగ మంత్రి సుగియోనో హాజరయ్యారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ, నాలుగేళ్ల విరామం తర్వాత ఇరు దేశాల మధ్య సంయుక్త కమిషన్ సమావేశమైందని చెప్పారు. ఈ మధ్య కాలంలో ద్వైపాక్షిక సంబంధాలలో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. రక్షణ, భద్రత, సముద్రయానం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, ఔషధాలు, ఆహార భద్రత, పర్యాటకం, విద్య సాంస్కృతిక సహకారం వంటి అంశాలపై ఇండోనేసియా విదేశాంగ మంత్రి సుగియోనోతో కీలకమైన చర్చలు జరిగాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడిస్తూ…

(వాయిస్…27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో గృహ వినియోగానికి ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్ ధర 29 రూపాయలు పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెంచిన ధరలు ఈరోజు నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇదిలా ఉండగా అంతర్జాతీయంగా ఎల్పిజి ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ, దేశంలో మాత్రం తక్కువ ధరలకే వంటగ్యాస్ సరఫరా అవుతోందని కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో వంట గ్యాస్ సిలిండర్ ధర అభివృద్ధి చెందిన దేశాలలో కంటే తక్కువగా ఉందని పేర్కొంది. అదే సమయంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద సంవత్సరానికి నాలుగు సిలిండర్లకు ఒక్కో సిలిండర్ పై 300 రూపాయల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. హోర్ముజ్ జలసంధి వద్ద రవాణాకు అంతరాయంతో పాటు గల్ఫ్ దేశాల నుంచి వచ్చే గ్యాస్ సరఫరాను కఠినతరం చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ మధ్య ఎల్పిజి ధర 14.2 కేజీల సిలిండర్ సరఫరా ఖర్చు 1,600 రూపాయలకు పైగా పెరిగిందని కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయినప్పటికీ వంట గ్యాస్ సిలిండర్ ధరను 942 రూపాయలకే స్థిరీకరించామని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

మురికివాడల నివాసితులకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ముంబైలోని దహిసర్‌లో హెచ్‌యూఎల్ సువిధ పారిశుధ్య సదుపాయాన్ని కేంద్ర మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మరుగుదొడ్లను గౌరవ గృహాలుగా అభివర్ణించారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని వ్యాఖ్యానించారు. ప్రతి మురికివాడను పునరాభివృద్ధి ద్వారా సరైన భవనాలుగా మార్చి నివాసితులకు మెరుగైన వాతావరణాన్ని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశ ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా కోరారు. ప్రతీ ఒక్కరూ శరీర దారుఢ్యం విషయంలో అవగాహన కలిగి ఉండాలని, స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్మించడంలో సహకరించాలని ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం పోస్టులో ఆయన ఆకాంక్షించారు. మెరుగైన ఆరోగ్యం కోసం, బలమైన దేశం కోసం వంట నూనెల వినియోగాన్ని పది శాతం తగ్గించి, సమతుల్య ఆహారాన్నిప్రజలు స్వీకరించాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఇదిలా ఉండగా.. ప్రతి సంవత్సరం జూన్ 7వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం నిర్వహిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

సౌత్ ఏషియన్ ఫుట్ బాల్ ఫెడరేషన్ (SAFF) మహిళా ఛాంపియన్‌షిప్-2026ను గెలుచుకున్న భారత మహిళా ఫుట్‌బాల్ జట్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. టోర్నమెంట్ అంతటా జట్టు అద్భుతంగా రాణించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు. ఫుట్ బాల్ ఆటపై ఆసక్తి కలిగిన యువతను ఈ విజయం ప్రోత్సహిస్తుందని అన్నారు. జట్టు తదుపరి ప్రయత్నాలకు కూడా నరేంద్రమోడీ శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

సైకిలింగ్ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా అన్నారు. సైకిలింగ్ అనేది మొత్తం పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుతుందని, ట్రాఫిక్ రద్దీ సమస్యకు సరైన పరిష్కారం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం 77వ ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, సైకిలింగ్ వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. శరీర దారుఢ్యం కోసం సైకిలింగ్ అవసరమని చెప్పారు. దేశ ప్రజలంతా 'ఫిట్ ఇండియా' లక్ష్యాన్ని స్వీకరించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

రాజౌరీ జిల్లాలో ఆపరేషనల్ విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన లెఫ్టినెంట్ బీరేశ్వర్ గోస్వామికి జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈరోజు నివాళులర్పించారు. జమ్మూలోని వాయుసేన కేంద్రంలో ఆయన భౌతిక కాయానికి సైనిక లాంఛనాలతో పుష్పగుచ్ఛం సమర్పించారు. నిన్న సాయంత్రం గంభీర్ మొఘల్ ప్రాంతంలోని డోరిమాల్‌లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తుండగా లోతైన లోయలో జారిపడి లెఫ్టినెంట్ గోస్వామి మరణించారు. రాజౌరి జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో దాగి ఉన్నారని భావిస్తున్న పాకిస్తానీ ఉగ్రవాదుల జాడను కనుగొనేందుకు చేపట్టిన 'ఆపరేషన్ షేరువాలి'లో లెఫ్టినెంట్ గోస్వామి పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాల విస్తరణతో రాబోయే రెండు మూడు రోజుల్లో దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. రాబోయే రెండు మూడు రోజుల్లో మధ్య అరేబియా సముద్రం,

మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలు, నైరుతి బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలలో నైరుతి రుతుపవనాల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. రేపు తీరప్రాంత కర్ణాటక, కేరళ, మాహే, పశ్చిమ బెంగాల్ సిక్కింలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆ వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ…

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. నాగ్‌పూర్‌లో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతంలో 92 శాతం నమోదవుతుందని అంచనా ఉందని అన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల మరాఠ్వాడా, పశ్చిమ విదర్భ, ఉత్తర మహారాష్ట్ర ఇతర కరువు పీడిత ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని దేవేంద్ర ఫడ్నవిస్ పేర్కొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడంలో రైతులకు సహాయపడేందుకు రాష్ట ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. వారికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు జారీ చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర-2026 అనే రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించింది. ఈ నెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సన్నాహక కార్యక్రమాలను 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనుంది. జూన్ 21న అమరావతిలో జరిగే భారీ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సాగే యోగా సన్నాహక వేడుకల్లో వేలాది మంది పాల్గొని సామూహికంగా యోగా చేయనున్నారు. దీని ద్వారా ప్రజలలో విస్తృత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, యోగా వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా కోటి మంది ప్రజలకు యోగా కార్యకలాపాలను చేరవేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =